# నెత్తురు సంబంధం

బుచ్చయ్య చాలా అమాయకుడు. తానూ, తన సంసారం తప్ప యితర ప్రపంచంతో రవ్వంత సంబంధం కూడా వుంచుకోడు. ఉంచుకొనే అవసరం కూడా లేదు. వున్నది పది కుంటలైనా ఆ కాళంత కయ్యకు ఎప్పుడూ తీరిక వుండదు. వరి కోస్తే రాగి, రాగి వడిపితే జొన్న .... ఎక్కడుండే పిడకలనూ ఏరి తెచ్చేవాడు. అదృష్టంలేక ఆ యిల్లాలు గతిం చింది. కానీ లేకుంటే ఆ సంసారం వసంతకాలంలో మామిడి చెట్టులాగా విరగబూసేది. పోతూ పోతూ ఒక మగ పురుగును అప్పగించి పోయింది. ఏడాది బిడ్డ. ఎత్తే బిడ్డా కాదు. నడిచే బిడ్డా కాదు. ఎలా పెంచాడో విద్యా బుద్ధులు నేర్పి ఒక మనిషిగా తయారు చేశాడు.

నరసింహం ఖులాసాగానే వుంటాడు గానీ ఒక్కొక్కసారి కూచుంటే ఆలోచనలో పైకి లేవనేలేడు. ఆ ఆలోచనలో తన్నుతానే మరచి పోతాడు. ఉన్నట్లుండి వాళ్ళ నాన్న పిలిస్తే ఉలిక్కిపడి ఈ లోకంలో పడు తుంటాడు. "ఏమిరా ఎప్పుడూ ఏవో ఆలోచిస్తుంటావు చెప్పరాదురా?" అని నాన్న అంటుంటే "ఏమీ లేదులే నాన్నా" అంటూ లేచిపోతాడు.

బుచ్చయ్యకు ఈ వాలకం ఏమీ అర్థం కావడం లేదు. ఈ ఆలోచ నకు కారణ యేమిటో తెలుసుకోవడానికి ఎంత ప్రయత్నించినా వీలుకావడం లేదు. తాను శక్తి వున్నంతవరకూ అన్నీ చూచు కుంటూనే వున్నాడు. ఎంత కష్టం వచ్చినా సరే ఒక్క పూటైనా పస్తు పెట్టలేదు సరిగదా, నర సింహానికి సంగటిని చూపనేలేదు. ఎప్పుడూ అన్నమే. పండుగవచ్చినా

పబ్బం వచ్చినా కొత్తబట్టలు తెచ్చిపెట్టేవాడు. తేరు జరిగినా, తిరునాళ్ళు వచ్చినా చేతి ఖర్చులకు యిస్తూనే వున్నాడు. తల్లి లేని బిడ్డగదా యిరుగు పొరుగువారు మంచిజరిగినా, చెడ్డ జరిగినా యింటికి తీసుకెళ్ళి కలిగింది పెట్టి ఆదరిస్తూనే వున్నారు.

ఇంత ఆదరణ, మరింత ఆసక్తి అనుదినం పెరుగుతూ వున్నా నర సింహం ఏదో ఆలోచన పెట్టుకొని ఎప్పుడూ లోలోపలే క్రుంగి పోతున్నాడు. పాపం. అమ్మను తలచుకొని అలా ఐపోతున్నాడేమోనని అప్పుడప్పుడూ బుచ్చయ్య అనుకొని లోలోపలే చింత పడేవాడు. ఆ చింతకు తగ్గట్టు వాడి పెళ్ళి విషయం ఏం చేయాలో తోచక తెగని ఆలోచనలో పడ్డాడు బుచ్చయ్య.

ఓనాడు పాపయ్య యింటికి వచ్చాడు. తన కూతుర్ని ఎంతో కాలం అలాగే వుంచుకోవడానికి వీలు కాదనీ, ఏదో అయిందనిపిస్తే చాలని తన కేమీ నగలు నాణేలు కావాలనీ, సొమ్ములు గిమ్ములు పెట్టాలని పట్టు లేదనీ చెప్పాడు. పాపయ్య బుచ్చయ్య అక్కకొడుకు. దగ్గరున్న బాధ్యం అదొక్కటే. అంచేత అది విడిస్తే మళ్ళీ దొరకడం కష్టమనీ.... దొరికినా ఓలి లేనిది ఆలురాదని బుచ్చయ్యకు తెలుసు. కనుక ఎదురింటి శీనయ్యను పిలిచి కూచోబెట్టి వక్కాకు శాస్త్రం ఎప్పుడైతే బావుంటుందో నిర్ణయించమన్నాడు. ఈ మాటలను చూచాయగా తెలుసుకొన్న నరసింహం వెంటనే వాళ్ళ నాన్న దగ్గరకు వెళ్ళి "ఇప్పుడు పెళ్ళెందుకులే నాన్నా" అన్నాడు. "అదేమిట్రా పెళ్ళి విషయంలో అలా చెప్పడం దేనికి? ఏమిటి అసలు కథ?" అన్నాడు. "ఏమీ లేదు. నాకిప్పుడు వద్దు అంతే" అంటూ లేచి వెళ్ళి పోయాడు.

"ఏదో పిల్లతనం. పెట్టుకొంటే అంతా కుదురు కుంటాడులే" అన్నాడు శీనయ్య. "కాదులే శీనయ్యా! అసలు విషయం తెలుసుకోవాలి.

వాడొక తరహా మనిషి" అంటూ బుచ్చయ్య లేచిందే బైటికి వెళ్ళాడు. వచ్చిన పెద్దమనిషితో శీనయ్య మాట్లాడుతూవుంటే అరగంట గడిచిందో లేదో బుచ్చయ్య వచ్చిందే "ను వెళ్ళు పాపా వాడింక నా కొడుకు గాదు" అన్నాడు. కన్నీరు విడిస్తూ. "ఏం జరిగింది మామా ఎందు కలా తొందర పడుతారు?" అన్నాడు. పాపయ్య "నీకు తెలీదులే పాప? వాడు చెడిపొయ్యాడు. వాడికి మంచికాలం లేదు" అన్నాడు బుచ్చయ్య.

"ఎందు కలా కోప్పడుతావు బుచ్చయ్యా, ఏమన్నాడు వాడు?" అన్నాడు, శీనయ్య. ఏమంటాడూ? ఆ గుడ్డిదాన్ని చేసుకుంటాడంటా .... యింతకూ వాడికి పోయేకాలం వచ్చిందిలే" అంటూ బోరు మన్నాడు బుచ్చయ్య. "గుడ్డిదాన్నే ఓరి బడుద్దాయి వీడికేం పిచ్చా?" అన్నాడు శీనయ్య. "సరేలే మామా। ప్రయత్నించి చెబితే వింటాడేమో! మరో సారి వస్తాలే। నీ వేమీ వాడిని చెయ్యిచేసుకోకు అంటూ వెళ్ళిపోయాడు పాపయ్య.

"ఏంచేద్దాం శీనయ్యా ఈ పాడుబుద్ధి వాడికెలా పుట్టిందో వాడింతకు తెగబడుతాడని నేను ఎన్నడూ అనుకోలేదు. లేకుంటే అసలు కథే వేరుగా వుండేది" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ బుచ్చయ్య. "నీవు తొందర పడకు బుచ్చయ్యా అసలు ఈ విషయం వింటేనే నాకూ ఆశ్చర్యంగా వుంది. బంగారంలాంటి కుర్రాడు గుడ్డిదాన్ని పెళ్ళి చేసుకోవడమంటే ఇందులో ఏదో కిటుకుంది. మెల్లగా తెలుసుకుందాంలే........ నీ వేమీ అధైర్యపడకు" అని బుచ్చయ్యను సముదాయించి వెళ్ళాడు శీనయ్య.

## 2

నరసింహం చిన్నతనంలోనే మీనాక్షితో స్నేహం బలపడింది. ఆ చిరుతప్రాయంలోనే మీనాక్షికి కళ్ళు లేవు అయినా, ఆ చిన్ని పలుకులు చిలుక పలుకులను మరపించేవి. ఆ మంజుల గాత్రం కోకిల కంఠాన్ని

స్ఫురణకు తెచ్చేది. కళ్ళు కనబడకుండా తారాడుతుంటే నరసింహం చేయి పట్టుకొని యింటికి తీసుకెళ్ళి విడిపించేవాడు. ఒక్కొక్కసారి మీనాక్షి వద్ద పాటలు పాడించుకొని వింటుండేవాడు. చిన్నతనం గనుక ఈ చెలిమి సహజంగానే కనిపించేది. ఇందుకు అవరోధంకూడా వుండేదికాదు. ఇలాగా పెరిగిన చెలిమి గనుక చాలా బలంగా ఎదుగుతూ వచ్చింది. కానీ మధ్యలో మీనాక్షి ఋజువైనప్పటినుండీ ఇద్దరి మధ్య పెద్ద గోడ ఏర్పడి పోయింది. ఇద్దరూ మాట్లాడుకోవడం నాలుగైదు రోజులకొకసారి గూడా సంభవించడం లేదు నరసింహం యింటికి, మీనాక్షి యింటికి మధ్య అట్టే దూరం లేక పోయినా మధ్య రెండు బారీ మేడలున్నాయి. ఆమేడల కాచివర నరసింహం పూరిల్లు. ఈచివర మీనాక్షి బోదిల్లు. మాట్లాడ్డానికి వీలుపడకపోయినా నరసింహులుమాత్రం రోజూ ఒక్కసారైనా చూచేవాడు. తాను ఆమెను చూస్తున్నానని ఆమెకు తెలియదుగా అంచేత యిద్దరూ చిన్నపుడు ఆడు కొంటూ పాడే పాట తొలి నుడుగు వినిపిస్తూ వెళ్ళేవాడు. ఆ నుడుగువింటే నరసింహం వచ్చాడనీ.... తన్ను చూచి వెళ్ళాడని మీనాక్షి సంతృప్తి పడేది.

ఓనాడు మీనాక్షి రాట్నంలో నూలు తీస్తూవుంది. కళ్ళు కనబడక పోయినా నూలు వడకడంలో అందెవేసిన చెయ్యి....వడుకుతూ వడుకుతూ వుంటే....

"ఎన్నెల్లా సన్నాఖీలో
వన్నెల్లా సన్నాయిలో" అంటూ సన్నని స్వరం వినిపించింది. నూలు తీయడం నిలిపివేసి స్వరం వస్తున్న వైపుకు చెవులు సారించింది. నరసింహం చుట్టుప్రక్కల చూచాడు. ఎవరూ లేరు. ఇంట్లో గూడా ఎవరూ వున్నట్లు అలికిడి లేదు. "మీనాక్షీ" అన్నాడు నరసింహం.

"ఏం మావా" అన్నది మీనాక్షి.

"నే నీ దినం చెప్పేళాను"

"ఏం చెప్పావు....ఎవరికి"

"ఎవరికో ఎందుకు? ఇంట్లోనే చెప్పాను"

"ఏమని చెప్పావు?"

"ఏముందీ? మన పెళ్ళిసమాచారం ముందుగా చెప్పాలనుకొన్నాగా చెప్పాను" అన్నాడు నరసింహం. ఈమాట విన్నదే మీనాక్షి రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. ఆమెకు ఆశ్చర్యం వేసింది. తన్ను వివాహం చేసుకొనేవాడు గూడా ఈ లోకంలో వుంటాడని ఆమె అనుకోలేదు. నరసింహం చెబుతున్నా ఆమెకు విశ్వాసం కుదరలేదు. అంచేత ఏదో ఆలోచన తియ్యని కోరికలు ఉదయిస్తున్నా వాటిని నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తూ వచ్చింది. కానీ, నరసింహం మాత్రం అప్పుడప్పుడూ ఈవిషయాన్ని కదుపుతూనే వచ్చాడు. చివరికి ఆ దినం నాన్నకు గూడా తెలియజేశానని చెబుతుంటే ఆమెకు ఆనందమూ, ఆశ్చర్యమూ నరసింహంమీద జాలిగూడా కల్గింది. "పిచ్చోడివి నన్ను చేసుకొని ఏం సుఖపడతావు మావా! నీకేం తలరాత?" అన్నది మీనాక్షి.

"నీకు తెలియదు మీనాక్షీ అదేమిటో ఎప్పుడూ నిన్నుచూస్తూ నీ పాటలు వింటూ వుండిపోదామనిపిస్తోంది. నీవు సమ్మతించుకుంటే నాకీ లోకములోనే పనిలేదు" అన్నాడు నరసింహం మీనాక్షి చాలాసేపు చెప్పి చూపింది. పెళ్ళి చేసుకొన్న వెనుక నలుగురూ నిన్ను చులకనగా చూస్తారని, అప్పుడు ఓర్చుకోలేవని గూడా అన్నది. ఎంతచెప్పినా, మరెంతగా వద్దన్నా అతడు వినలేదు పెళ్ళినిశ్చయమే మీ వారికి కూడా చెప్పేసేయ్ ఆ మీద దేవుడి దయ" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలం మీనాక్షి తల్లి యింటికి వచ్చింది. మీనాక్షి నాన్నగారు చిన్నతనంలోనే చనిపోయారు. ఆస్తిపాస్తు లేమీ లేవు. ఆ యిల్లు, అది

గూడా చాలా చిన్నదే. అమ్మ కూలిచేసి పెడుతుంటే కూతురు యింట్లో వుంటూ నూలు వడకడం విస్తళ్లు కుట్టడం యీలాంటి నీడలో పనులు చేసు కుంటూ కాలక్షేపం చేస్తున్నది. మునెమ్మ యింటికి వచ్చిందే కూతుర్ని చూచి, ఏమిటి మీనాక్షీ! ఊళ్లో యెక్కడ చూచినా ఒకటే గోలగావుంది. ఈ అగుడేమిటమ్మా” అన్నది.

“నాకుమాత్రం ఏం తెలుసునమ్మా! ఈదినం తెల్లారి నరసింహ మొచ్చి ఏదో చెప్పి వెళ్ళాడు” అన్నది మీనాక్షి.

“ఏమిటో నమ్మా! అంతా మన గ్రహచారం. ఏదో ఉండేవాళ్ళను పూరికే వుండనివ్వక వీధిలోకి ఈడుస్తున్నారు. ఈ వూళ్ళో ఎవర్నీ నమ్మ కమ్మా.... పాడు దేముడు' చిన్నచూపు చూశాడు. లేకుంటే నీ యోగం ఎలా వుండేదో” అంటూ అన్నం తెచ్చి పెట్టింది. అన్నం కలుపుతూవుంది మీనాక్షి. ఆ కూరలో తన కన్నీళ్ళు కూడా కలిసి పోతుంటే మునెమ్మ చూచి “అదేమిటే ఎందుకలా ఏడుస్తావు? నేను ప్రాణంతో వున్నంత వరకూ నీ కేం కాదులే” అంటూ దగ్గరికి వచ్చి కన్నీళ్ళు తుడిచింది కొంగుతో....

మీనాక్షి పిడికెడు మెతుకులు తిన్నశాస్త్రం చేసి కూటంలో జంబు చాపవేసి పడుకున్నది. “వక్క పలుకు నమలుతావా'' అన్నది మునెమ్మ. “వద్దు లేమ్మా!'' అని కాస్సేపు ఆగి “అమ్మా ఇప్పుడు వెన్నెల కాస్తున్నదా'' అన్నది మీనాక్షి “లేదమ్మా” అన్నది మునెమ్మ.

పాపం మీనాక్షికి వెన్నెల ఎలా వుంటుందో చూడాలని ఆశ.... కానీ అదృష్టం వుండొద్దూ? ఆ రాత్రి నరసింహాన్ని గురించి తల్లీ కూతుళ్ళు యిద్దరూ మాట్లాడుకొని పడుకొన్నారు.

## 3

ఆ దినం సోమవారం. సంతరోజు గనుక ఊరంతా కోలాహలంగా వుంది. ఆ కోలాహలంగా గుంపులు గుంపులుగా చేరుకొని మీనాక్షి మాట చెప్పుకుంటున్నారు. ఇదంతా నరసింహం సాహసమేనని. కొందరు కాదు మీనాక్షి గడుసుదనమని మరికొందరు. అదీకాదు మునెమ్మ కార్యవాదిత్వమని మరికొందరు ఎవరికి తోచినట్లు వారనుకుంటున్నారు. ఆ మాట ఈ మాటా అనుకోవడం ఆవెంటనే "అయిపోయిన పెళ్ళికి మేళం ఎందుకులే" అంటూ పెదిమవిరచి ఎవరిదారినవారు వెళ్ళిపోవడం జరుగుతుంది. ఎవరేమనుకున్నా ఎన్ని విధాలుగా చెప్పుకున్నా పెళ్ళిమాత్రం అయిపోయింది నరసింహం ఎవరితోనూ చెప్పకనే మీనాక్షమ్మను పిలుచుకొని చిర్తానూరికి తీసుకెళ్ళి పెళ్ళి చేసుకొని వచ్చేశాడు. మూడు ముళ్ళూ పడిపోయిన వెనుక చేసేదే ముందిలే అని బుచ్చయ్యకు నచ్చచెప్పడానికి శీనయ్యవంటి పెద్ద మనుష్యులు ప్రయత్నించారు కానీ లాభం లేకపోయింది. "ఇంత కథకూ వచ్చాక వాడితో నాకేం పనుంది? వాడు కొడుకూగాదు. నేను అబ్బాగాదు" అంటూ బిర్రబిగిసి కూచున్నాడు బుచ్చయ్య. "మంచీ చెడ్డా తెలిసిన నీవే నెత్తురులో నెత్తురును కాదంటే నలుగురూ నవ్వరా" అని మళ్ళీ ప్రారంభించాడు శీనయ్య. "నీకు తెలీదులే శీనయ్యా. వాడు నాకే పుట్టివుంటే యింతకు తెగబడుతాడా.... ఇక వాడికీ, నాకూ ఋణానుబంధం నేటితో తెగిపోయిం దనుకో" అంటూ లేచివెళ్ళబోయాడు బుచ్చయ్య. ఆ సమయానికి సరిగ్గా నరసింహం వచ్చి లోపలికి పోబోతుంటే "నిలూ అక్కడే.... లోపలికి వచ్చావంటే బుర్ర మాగేస్తాను." అంటూ పైకి వెడుతున్న బుచ్చయ్యను పట్టుకోవలసి వచ్చింది శీనయ్య. నరసింహం ఏమీ మాట్లాడకుండా వెనక్కి వచ్చేశాడు.

ఆ మరునాడు నరసింహం పొలానికి వెళ్ళి అంద చెక్కడానికి నడుం వాల్చాడు. పది బారులు గనాన్ని చెక్కాడో లేదో బుచ్చయ్య వచ్చిందే "ఏంముఖం పెట్టుకుని వచ్చావురా? సిగ్గులేదూ!" అంటూ పారను లాక్కుని "నరుకుతా" నంటూ పైకెత్తాడు. నరసింహం ఏమీ మాట్లాడకుండా తలకాయ వంచుకొని వెళ్ళిపోయాడు.

ఆరోజు నుండి నరసింహం యింటికి పోవడం మానుకొన్నాడు. పొలంలో అడుగుపెట్టడంకూడా విడుచుకొన్నాడు. అలాగని అత్తింటిలోనే కాపురం పెట్టలేదు. ఆ ఊళ్ళోనే సున్నపు వీధిలో ఒక గుడిసె కట్టాడు. అడవికి వెళ్ళి ఊడగ వూచలు తెచ్చాడు. దగ్గరే వున్న చిత్రాకుంటకు వెళ్ళి జంబు కోసుకుని వచ్చాడు. తానే స్వయంగా గోడ పెట్టాడు. మూడున్నర రూపాయలుపెట్టి దూలంకొన్నాడు. మిగిలిన పనులన్నీ పెండెకట్టడం, దిండు కట్టడం వరకు తానేచేసి ఇల్లు కప్పుకున్నాడు, తాత్కాలికంగా తడికె వేసుకొని మీనాక్షిని పిలుచుకొనివచ్చి కాపురం పెట్టాడు. తాను యింత కష్టపడుతూ వుంటే కాస్తా తెలివిగల్గిన జనం "వీడికేం గ్రహచారంరా" అంటూ హేళన చేశారు. ముసలాడి కోపం యింతా చేయిస్తున్నాదని యీసడించారు. ఇదేమిటో విపరీతంగా వుందిరా అని రౌడీరకం ముక్కుమీద వేలేసుకొన్నారు. ఎన్ని విమర్శలు వినబడినా నరసింహం లక్ష్యపెట్టలేదు. తాను స్వయంగా ఒకడిని యాచించకుండా బ్రతకాలనుకున్నాడు అంచేతనే అత్తగారిల్లువున్నా తాను స్వయంగా గుడిసె కట్టుకున్నాడు.

మంచి కండపుష్టి.... ఎండలకు తట్టుకొనే గుండెబలం.... పనిలో సోమరితనంలేదు. పైగా సేద్యంలో ఆరితేరిన చేయి. ఏతాం తొక్కడం నారు పెరకడం, ఆకుదించడం, వాడెలుగొట్టడం, సాలుతీయడం యీలాంటి కష్టమూ, నేర్పూ అవసరమైన పనులన్నీ తనకు బాగా తెలుసుగనుక కూలికి

అందరూ పిలిచేవారే. నరసింహం అంటే నాలుగు మడకల సేద్యంచేసే వాడని ప్రతీతి. ఏటి కాలవకు నరసింహాన్నే ఎంచుకునేవారు ముందు మనిషిగా రైతులు. ఎంత లోతుకాలవైనా నరసింహం వంగి బలిచెక్కతో ఇసుకను పైకెత్తి వేశాడంటే అది గట్టు దాటుకొని గజం యివతల పడాలి. అంత బలమూ, అంత నేర్పూ వున్నది గనుకనే నరసింహాన్ని అందరూ పిలుస్తూంటారు కూలికి.

మీనాక్షికి వండడం, వార్చడంగూడా సాధ్యంకాదు. ఆమె ప్రయత్నం చేయాలనుకున్నా ఎక్కడ నిప్పువుందో...... ఎక్కడ మంటవుందో...... ఎక్కడ చట్టివుందో తెలుసుకోకుంటే ఏబట్టకో నిప్పంటుకొంటే ఎంత ప్రమాదం. కనుక వంట విషయంలో నీవు కల్పించుకోవద్దని గట్టిగా కట్టడిచేశాడు నరసింహం

నరసింహం వద్దన్నా మునెమ్మ ముందుగా వచ్చి ఏదో వండిపెట్టేది. "నీకింక ప్రత్యేకంగా ఎసరెందుకులే అత్తా యిక్కడే వచ్చి వుండిపో" అన్నాడు నరసింహం. అందుకు సమ్మతించింది మునెమ్మ "కట్టా కంపా తెచ్చుకొని యిల్లూ వాకిలీ చూచుకొనివుంటే చాలదా.... ఇంకా ఎన్నాళ్ళు పాడుకష్టం" అన్నాడు అత్తతో ఒకనాడు నరసింహం.

"నీకు తెలియదులే నాయనా? ఒకడి రెక్కల కష్టం ముగ్గురు తినడం బావుంటుందా? నాకేం కష్టం లేదులే.... నిండా అలసట కనబడితే వారానికి ఒకటి రెండు రోజులు — నిలిచిపోతాలే" అన్నది మునెమ్మ.

చేసేది కూలైనా ఆ దంపతుల జీవితంలో వెన్నెల మెరసిపోతోంది. మీనాక్షి అంధురాలైనా ఆమె ముఖంలో అనురాగ భావగీతాలను చదువు తున్నాడు నరసింహం. ఆమె పెదిమల కదలికలో కనబడుతున్నది ఆనందం..

ఆ పసిడి బుగ్గల అరణిమలు.... చూచుకుంటూ తనకు తానే మురిసిపోతాడు నరసింహం....

"మావా.... వెన్నెల్లో పడుకుందాం" అన్నది మీనాక్షి. "ఇది వెన్నెలే" అన్నాడు .... నరసింహం .... "అమ్మో ఏమారుస్తావూ... గుడిసె లోపల వెన్నెలుంటుందా" అన్నది నవ్వుతూ మీనాక్షి.

నరసింహం పైకిలేచి ఆమె చేయిపట్టుకొని వెన్నెలలోకి పిలుచుకొని వచ్చాడు. ఆ పెళ్ళి తిన్నెమీద జంబుచాప పరచుకొని యిద్దరూ కూచున్నారు. "మావా ఆకాశంలో చంద్రుడు ఏపక్క వున్నాడూ?" అన్నది మీనాక్షి.

"పడమట"

"అంటే ఈపక్కా" అన్నది ఉత్తరాన్ని చూపుతూ మీనాక్షి.

"కాదు ఈ ప్రక్క మీనాక్షి" అని ఆమెను పడమటి దిక్కుకు ముఖం త్రిప్పి కూచోబెట్టాడు.

"ఇపుడు చంద్రుడు సగమే కనబడుతున్నాడు"

"లేదు నిండు చంద్రుడే"

"అంటే పౌర్ణమిగద మావా?"

"అవును"

"ఐతే ఆ పాట పాడు మావా"

"ఏ పాట?"

"అదే ఎన్నోళ్లో సన్నాభీ"

"నువ్వే పాడు ...."

"పాడు మావా...." అంటూ చేయిపట్టుకొని లాగింది మీనాక్షి.

" ఊఁహూఁ.... నాగొంతు ఏం బావుందిలే.... నువ్వే పాడు...." అన్నాడు.... నరసింహం....

" నేను పాడను "

" అయితే, నేనొక నుడుగు.... నువ్వొక నుడుగు " ముందు నువ్వే పాడు.

" అట్టాగే మావా....

ఎన్నెల్లో సన్నాభీలో
వన్నెల్లా సన్నాయిలో
పిన్నెల్లా దొరసానీ
పినదానా రంగసానీ! " అని నిలిపింది మీనాక్షి.
ఎన్నెల్లో సన్నాభీలో
వన్నెల్లా సన్నాయిలో
రావే నా పినదానా
రంగు సీరేలదానా " అని అందుకున్నాడు నరసింహం.

ఈలాగా పాడుకుంటూ ఎన్ని గంటలు గడిపారో తెలియదు. అలాగే సొమ్మసిల్లి నిద్రపోయారు. ఆ ఉదయం లేచిందే మూడో శనివారం గనుక ఒక్కపొద్దుండాలి. కూలికి వద్దన్నది మునెమ్మ. తిరవళ శనివారాల్లో మూడో వారం ముఖ్యం. ఆదినం మాలాడి యింట్లో కూడా ఒట్టి రాగి పిండి సంగటి పెట్టినా ఆప్యాయంగా తింటాడట ఏడుకొండలవాడు. మీనాక్షికి అది మూడో నెల. కొడుకు పుడితే వెంకటేశ్వరుడని, కూతురు పుడితే అలిమేలని పేరు బెట్టి, పుట్టునీలాలిచ్చి, నిలువు దోపిడీ యిస్తానని మొక్కుకున్నది మునెమ్మ. నరసింహం ఒక బుడిగెతీసుకొని అందులో ఒక బేడ వేసి పసుపు గుడ్డ కట్టి చూరుకు వేలాడగట్టాడు.

అసలే కళ్ళు కనబడవు. నిండుమనిషి గదా? అంచేత మునెమ్మ మూడు ప్రొద్దులూ మీనాక్షిని విడిచిపెట్టి వెళ్ళేదిగాదు. నరసింహం పొద్దు పోగానే యింటికివచ్చి "ఏమైనా కావాలా తినడానికి" అని అడిగేవాడు మీనాక్షిని. గర్భంగావుండే ఆడవాళ్ళు రకరకాల పండ్లు తింటావుంటారని ఆమెకు అక్కింటామె పక్కింటామె చెబితే తెలిసింది. ఆ పేర్లు తెలుసుగానీ అవి యెలావుంటాయో చూచిన పాపాన పోలేదుగా? నరసింహం తెలుసుకొని చీనీ పండ్లు, కమలా పండ్లు అప్పుడప్పుడూ ఒక్కొక్కటి తెచ్చిపెట్టేవాడు. అన్నెం పున్నెం తెలియని "నా బంగారు మీనాక్షి కొడుకును కంటుందిలే" అంటూ మురిసిపోతుండేది మునెమ్మ.

ఆమె ఆశీర్వాదం ఫలించింది. బంగారంలాంటి బిడ్డ వెంకటేశ్వరుడే పుట్టాడని ఎగిరి గంతేశాడు నరసింహం. చూచిన అమ్మలక్కలంతా "బుచ్చయ్య తాతను ఒలుచుకొని పుట్టాడే వీడు" అన్నారు. శీనయ్యగూడా వచ్చి బిడ్డను చూచి వెళ్ళాడు. ప్రక్కింటి తోళసమ్మకు కొంటెతనం ఎక్కువ. పురిటినాడు జోలపాడుతూ "వీడి ముక్కు బుచ్చయ్య తాతది. వీడి కళ్ళు నరసింహన్నవి. వీడి బుగ్గలు మీనాక్షివి" అన్నది: అందరూ గలోమని నవ్వారు. వచ్చిన ముత్తైదులకంతా వక్కాకిచ్చి పంపింది మునెమ్మ.

మూడో ఏడు మునెమ్మ, మీనాక్షి, నరసింహం, బిడ్డను పిలుచుకొని ఇలుతీర్థం బయలుదేరారు తిరుపతికి. పుట్టు నీలాలిచ్చి వెండి మొలత్రాడు, నిలువు దోపిడీ యిచ్చివచ్చారు.

## 4

వెంకటేశ్వరుడికి ఆరోయేడు నిండింది. ఓనమాలు నేర్చుకొన్నాడు. అ ఆ లు సుమారుగా వచ్చు. ఓనాడు బడి నుండి వస్తూవున్నాడు. ఎదురుగా

వస్తూవున్న ముసలాడు రాయి తగులుకొని పడిపోయాడు. పరుగెత్తు కొంటూ వెళ్ళి చేయి పట్టుకున్నాడు. ముసలాడు పైకి లేస్తుంటే క్రింద పడ్డ కర్ర చేతికందిచ్చాడు. పిల్లాణ్ణి ఎగాదిగా చూస్తూ వెళ్ళుతూవున్న ముస లాణ్ణి చూచి "ఏం మనుమణ్ణి అలా చూస్తూన్నావు బుచ్చయ్యా?" అన్నాడు శీనయ్య. "వాడు నా మనుమడెందుకౌతాడులే" అన్నాడు బుచ్చయ్య. "నీకు కాటికెళ్ళినా పోదులే యీ బుద్ధి.... యింత పగా?" అంటూ వెళ్ళిపోయాడు. శీనయ్య.

బుచ్చయ్య యింటికివెళ్ళి సులక మంచాన్ని వాల్చుకొని కూచున్నాడు. ఇల్లు ముందులాగా శూన్యంగానే వుంది. "కాటికి వెళ్ళినా పోదులే యీ బుద్ధి" అని శీనయ్య 'అన్నమాటలు గమనానికి వచ్చాయి. మళ్ళీ గుడ్డిపిల్ల గమనానికి వచ్చింది, "ఛీ వాడు నా కొడుకూగాదు.... వీడు నా మనుమడూ గాదు అనుకున్నాడు. ఆ రాత్రి పడుకున్నాడుగానీ నిద్రపట్టలేదు. ఎలాగో ప్రయత్నం మీద కునుకుతీశాడు.

ఉదయం మళ్ళీ వెడుతుంటే రచ్చ దగ్గర గచ్చగాయ లాడుకుం టున్న వెంకటేశుడు కనిపించాడు, ముసలాణ్ణి చూచిందే "తాతా" అంటూ దగ్గరికి వచ్చాడు. బుచ్చయ్య క్షణం ఆగి పలక్కుండా వెళ్ళిపోయాడు. ఆ సాయంకాలం మళ్ళీ వస్తుంటే బడి ముందు ఆడుకుంటున్నాడు కుర్రాడు. అలాగే చూస్తూ నిలబడిపోయాడు. వాడు ఆట నిలిపివేసి వస్తూ ముసలాణ్ణి చూచాడు. "తాతా" అన్నాడు మళ్ళీ. బుచ్చయ్య మాట్లాడకనే వెళ్ళి పోయాడు,

ఆ రాత్రి బుచ్చయ్యకు పూర్తిగా నిద్రపట్టలేదు. కోడి కూసేటపుడు చిన్న కునుకువస్తే అందులో పెద్ద కల వచ్చింది. తాను చచ్చిపోయి

నట్టూ.... వెంకటేశుడు పెద్దవాడై యున్నట్టు.... తనకు తలకొరివి పెడుతు న్నట్టు... కోడలు కొడుకూ చూస్తూ యేడుస్తున్నటు ... ఉలిక్కిపడి లేచాడు బుచ్చయ్య. చుట్టూ చీకటిగావుంది. ఇంట్లో ఎవరూలేరుగా పలకడానికి? ఆ చీకటిని చూస్తుంటే బుచ్చయ్యకు అమితమైన దుఃఖం వచ్చింది. తనకు తానే ఏడ్చుకున్నాడు. మళ్లీ తనకు తానే ఓదార్చుకొన్నాడు.

ఎప్పుడెపుడు తెల్లవారుతుందా? అని లేచి కూచున్నాడు. సూర్యుడు పొడిచాడు. రచ్చ దగ్గరికి వెళ్ళి కూచున్నాడు. వెంకటేశుడు గచ్చకాయలు జేబీనిండుకు పోసుకొనివచ్చాడు. తాతను చూచిందే "తాతా" అన్నాడు. "రా.... రా...." అంటూ చేతులు చాచాడు బుచ్చయ్య. వాడు వచ్చాడో లేదో అమాంతంగా కౌగిలించుకొన్నాడు బుచ్చయ్య. చక్క దోశలవ్వ అంగడికెళ్ళి రెండు దోశలు రెండు వడలు పొట్లం కట్టించుకొని యింటికి పిలుచుకొని వెళ్ళాడు. ఆ దోశలు వడలు పెడితే "నువ్వూ తిను "తాతా" అంటూ ఒక్కొక్క ముక్కయెత్తి తాత నోట్లో పెట్టాడు. తాతకు ఎంతో హాయి ఆనందం పెల్లుబికిపోయింది ఏదో స్వర్గంలో వున్నట్టు తోచింది. ఆ క్షణంలో గొప్ప మధురానుభవాన్ని పొందాడు. "ఈ దినం బడికిపోను తాతా" అన్నాడు వెంకటేశుడు. "వద్దులేరా" అని కూడా తీసు కొని పొలానికి వెళ్లిపోయాడు.

వెంకటేశుడు బడికి రాలేదని పంతులు కుర్రాళ్ళను పంపాడు. కుర్రాళ్ళు యింట్లో అడిగితే అయ్యో చద్ది కూడా తాగలేదే అన్నది మీనాక్షి. "ఎక్కడి కెళ్ళాడు?" అని నరసింహం ప్రశ్నిస్తూ వుండగానే తౌళసమ్మ వచ్చి "ఇకనేం బుచ్చయ్య తాత మనుమడికి చెరుకుగుడ్లు ఒలిచి పెడుతు న్నాడు" అన్నది. ఈ మాట విన్నదే నరసింహానికి కోపం ముక్కుమీదికి

వచ్చింది. వెంటనే "వీడికేం అక్కడ పని.... వీడెవడు? ఆ ముసలా డెవడు?" అంటూ సరాసరి పొలానికి వెళ్ళాడు. బుచ్చయ్య చెరుకు ఒలిచి గీసు కత్తితో గుడ్లు కోసి పెడుతుంటే వెంకటేశుడు నములుతున్నాడు. వెళ్ళిందే చివాలుమని కుర్రాడిని యివతలికి లాగి వాడి చేతిలో నున్న చెరుకును పెరికి పారేశాడు. వాడు "తాతా.... తాత" అంటున్నా వినిపించుకోక కుర్రాణ్ణి రెండు తీసుకున్నాడు. వాడు ఏడుస్తూ మళ్లీ తాత దగ్గరకి వెళ్ళబోతే ఎత్తి భుజాన వేసుకొని వచ్చేశాడు. బుచ్చయ్య తాత చూస్తూ నిలబడి పోయాడు.

అతని నోట మాట రాలేదు. మధ్యాహ్నం వరకూ అక్కడే వుండి యింటికి వచ్చాడు. ఆశ్చర్యం ఏమంటే గొళ్ళెం పెట్టిన తలుపుదగ్గర కూచుని వున్నాడు వెంకటేశం. "నాన్న కొట్టాడా.... రా...." అంటూ తలుపుతీసి లోపలికి వెళ్ళాడు. "తాతా అన్నం...." అన్నాడు వెంకటేశు. పొలం నుండి అప్పుడే వచ్చాడుగా.... అన్నం ఎక్కడిది? "ఉండరా వండేస్తా" అన్నాడు. "నీకూ్కడా లేదా? వుండు వత్తా" అంటూ గబగబా యింటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేరు. అమ్మ కూచునివుంది. అలికిడి లేకుండా లోపలికి వెళ్ళాడు. చట్టిలో ఒక్కముద్ద తీసుకున్నాడు. ఊరిబిండి ఉట్టమీద వుంటే గంప బోర్లించాడు. అప్పటికీ అందితేగా.... దానిమీద పడిని నిలబెట్టి దానిపై ఎక్కి చట్టిపిడిత తీస్తుంటే అది క్రింద పడింది.... "ఎవర్రా వెంకటేశా" అన్నది తల్లి. వెంకటేశం పలకలేదు. పాడు కుక్కలు అంటూ అమ్మ లోపలికి వస్తే ఆమెను తప్పుకొని సంగటిముద్ద ఊరిబిండి తీసుకొని వుడాయించాడు. వాడు గడప దాటుకోగానే మునెమ్మ వచ్చింది. పరుగిడుతుంటే చొక్కా సందులో సంగటిముద్ద కనబడింది. ఎవరికీ ముద్ద? అనుకొని వెంబడే వెళ్ళింది. వాడు సరాసరి బుచ్చయ్య యింటిలో దూరాడు.

మునెమ్మ కన్నీరు విడుస్తూ యిచటికి వచ్చి మీనాక్షితో చెప్పింది. మీనాక్షికి ముసలాణ్ణి తలచుకుంటే దుఃఖం వచ్చింది. "అప్పుడేదో కోపంలో జరిగిపోయింది యింకా పట్టింపులైతే యేలాగా ఆయనకు నువ్వన్నా చెప్పమ్మా" అన్నది.

వెంకటేశం తాతకు సంకటి తినిపించి తాత యిచ్చిన అర్ధణా తీసుకొని రైలుకట్నాలు కొనుక్కొని బడికి వచ్చాడు. ఆ రాత్రి యింట్లో వాళ్ళ నాన్న గట్టిగా చెప్పాడు ముసలాడి దగ్గరికిపోతే తన్నులు తప్పవని. అంతా విన్నాడుగానీ ఉదయం మళ్ళీ తయారై తాత వద్ద కూచున్నాడు కథలు చెప్ప మని. మధ్యాహ్నం కాస్సేపు.... సాయంకాలం కాస్సేపు....ఒక్కొక్కసారి రాత్రి కావచ్చినా యింటికి రాడు. మునెమ్మ వెళ్ళి పిలుచుకొని వస్తుండేది. నరసింహం నాలుగైదుసార్లు కొట్టిగూడా చూచాడు. కానీ సాధ్యం కాలేదు. తాతా మనుమళ్ళ స్నేహం బాగా వేళ్ళు తన్నుకొని పోయింది. మనమణ్ణి చూడనిదే తాత ఒక్క క్షణంకూడా వుండలేడు. బడివేళల్లో గూడా మావాణ్ణి పద్యాలు చెప్పమనండి పంతులుగారూ అంటూ వచ్చికూచొనేవాడు. మాస్టరు ముసలాడిపోరు పడలేక చెప్పే పాఠం విడిచిపెట్టి వాడిచేత రెండు పద్యాలు చెప్పించి పంపేవాడు. మనుమడికి తినే వస్తువులు కొనిపెట్టడమే గాదు.... ఉడుపులు గూడా కుట్టించాడు తాత. "ఒరేయ్ వెంకటా.... మీ తాతను దినమ్మూ బాగా తన్నుతున్నావు గదా!" అనేవాడు శీనయ్య యిద్దరినీ చూచి. "నువ్వూరుకో శీనయ్యా" అనేవాడు బుచ్చయ్య నవ్వుతూ......

## 5

ఉన్నట్టుండి విరుచుకపడింది. ఆ వూళ్ళో పెద్దమ్మోరు. మీనాక్షికి ముమ్మరంగా పోసేసింది. ఆ జానెడు గుడిసెలో అమ్మోరు పోసిన మనిషితో మునెమ్మ, నరసింహం, బిడ్డ వున్నారంటే ముసలాడు అడుగలేక పోయాడు

"ఏమైనా అనుకోనీ, వాడు కొట్టినా దెబ్బలు తింటాను" అంటూ వూత కర్ర పొడుచుకొని బయల్దేరాడు బుచ్చయ్య. సమయానికి నరసింహం లేడు. "అమ్మా తాతొచ్చాదే.... తాత" అంటూ కేరింతలు కొట్టాడు కుర్రాడు. "మామయ్య.... కూచోండి. చాప వేయరా" అన్నది మీనాక్షి కుర్రాడు జంబుచాప తెచ్చి వేశాడు. ఎలా వుందమ్మా? నేను పాపిష్టిని" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు బుచ్చయ్య. "ఎందుకు మామయ్యా అవన్నీ ఏదో జరిగిపోయాయిలే" అన్నది మీనాక్షి. "ఇంటికి పోదాం రామ్మా" అన్నాడు బుచ్చయ్య. "పోదాంలే తాతా" అంటుండగానే నరసింహం వచ్చాడు. "నాన్నా మనింటికి పోదామా" అన్నాడు కుర్రాడు. "నీకు తన్నులు కావాల్లే.... నీవు నీయబ్బమాట వినేవాడివై తేగా?" అన్నాడు కసురుకుంటూ నరసింహం. "నీవు చాలా విన్నావులే నీ యబ్బమాట" అన్నది మీనాక్షి. నరసింహానికి ఏమీతోచక బయటికి వచ్చేశాడు. ఈలోగా మునెమ్మ వచ్చింది. "ఇక పోదామమ్మా" అన్నాడు బుచ్చయ్య. ఇల్లు కదిలావంటే తెగ నరుకుతా నన్నాడు నరసింహం....

ఈమాట వినిందే బోరుమన్నాడు ముసలాడు. "ఎందుకు మామయ్యా ఏడుస్తావు.... వూరుకో వస్తున్నా" అని లేచి కూచున్నది మీనాక్షమ్మ. వెంకటేశం చేయి పట్టుకున్నాడు. ఆమె వాని వెంబడి నడిచింది. ఆమె వెంబడి మునెమ్మ పోతున్నది. "ఊఁ....నడవరా....మహామగాడివి..." అంటూ బుచ్చయ్య తడికె వేశాడు "నేను రాను" అన్నాడు ధీమాగా నరసింహం. "ఎందుకు రావూ...." అంటూ చెయ్యిపట్టి లాగి పారేశాడు ముసలాడు. "వెళ్ళన్నా...." అన్నది అన్నీ చూస్తున్న తొళశమ్మ. నరసింహం నాలుగడుగులు ముందుకు వేసి వెనక్కి చూశాడు. "ఊఁ....

పదా" అన్నాడు ముసలాడు. నరసింహం పోతుంటే తొళసమ్మ నవ్వుతూ నిల్చున్నది.

వెంకటేశుడు తలుపుతీసి అమ్మను, అవ్వను దిగబెట్టి యెదురుగా వస్తుంటే నరసింహం "పదరా....అట్టే" అన్నాడు. వాడు తలవంచుకొని నవ్వుతూ యింట్లోకి వెళ్ళి "అమ్మా నాన్నగూడా వస్తున్నారే" అన్నాడు. నరసింహం యింట్లోకి వచ్చాడు. బుచ్చయ్యా కడప ముందుకు రాగానే ఎదిరింటి శీనయ్య వారింటి ముందునుండి "ఊఁపదా" అన్నాడు నవ్వుతూ, తాత ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలికి వెళ్ళాడు. ఆ మహానందంలో మీనాక్షి తన బాధనే మరచిపోయింది. ఆ రాత్రి వేకువజాము నుండి మీనాక్షమ్మకు తెలివి తప్పుతూ వచ్చింది.

తెల్లవారిందే మళ్ళీ కొద్దిగా తెలివివచ్చింది. నా బంగారు బ్రతికితే చాలు.... అంటూ మంచం దగ్గర కూచున్న ముసలాడు లేవనేలేదు. "అమ్మా ... అమ్మా" అంటూ వెంకటేశుడు పైకి వస్తుండేవాడిని దూరంగా పెట్ట మన్నది మునెమ్మతో కామాక్షి అమ్మోరు గదా ? ....

ఎగుపొద్దు.... మాధ్యాహ్నంవరకూ బ్రతికిందంటే బ్రతికినట్టే అన్నాడు శీనయ్య. అమ్మోరు పోసింది గనుక అందుకు వైద్యం ఏం చెయ్యాలో ఎవరికీ తెలీదు... ఆవు పంచితం చల్లారు. కర్పూరం దిగదీశారు. నరసింహం మాటిమాటికీ మంచం దగ్గరికి వెడుతూనేవున్నాడు.

"మావయ్యా"... అన్నది కామాక్షి. ముసలాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "మావా" అన్నది మళ్లీ నరసింహం వచ్చాడు. "అబ్బ ఎక్కడ" అన్నది సన్నగా.... "అమ్మా" అంటూ దగ్గరికి వచ్చాడు. "అమ్మా" అన్నది మళ్లీ. మునెమ్మ దగ్గరే వుంది.... "ఉన్నాను కొడకా"

అన్నది.... అందరినీ ఓమారు చేతుల్లో తడిమిచూడా లనిపించింది. చేయి పైకెత్తింది. కానీ అమ్మోరు గదా'' గమనానికి వచ్చింది.... మళ్లీ చేయి దించుకొన్నది.

''మావా వెన్నెల కాస్తున్నాదా!" అన్నది.... ''లేదమ్మా ఎండ'' అన్నది తల్లి. నరసింహం నోరు పెగల్లేదు. ''మావా మామయ్యను బాగా చూచుకో'' అన్నది కామాక్షి. ఈ మాట విన్నదే ముసలాడు బోరుమన్నాడు. మునెమ్మ ''నా వరాలో'' అంటూ మంచంమీదే వాలిపోయింది. ''అమ్మో అమ్మో అన్నాడు పిల్లాడు. నరసింహం మీనాక్షివంకే చూస్తున్నాడు. ఆమె తలదిండుమీద నుండి క్రిందికి జారిపోయింది. నరసింహం నిలువునా పడిపోయాడు.

ఆ మూడోనెల.... నిండు పున్నమినాడు, బుచ్చయ్యగారి పొలంలో. వెన్నెల వెలుగుల్లో చిన్న సమాధి దగ్గర నరసింహం....

''వెన్నెల్లో సన్నాభీలో వన్నెల్లా సన్నాయిలో" అని సన్నగా పాడుకుంటుంటే అతని సమాధి నుండి మళ్లీ అదే పదాలు వినిపించినై. బుచ్చయ్య చచ్చేవరకు పేరంటాలకు మొక్కుతూనేవున్నాడు.

Putrevu Raghavendra Rao
B. E. (Elec)
Divisional Engineer,
A. P. S. E. BOARD.